క్లుప్తంగా

నవశనివారాంజలి ప్రార్థనలు ప్రారంభం



ఏసుక్రీస్తు సందేశం వినిపిస్తున్న ఫాదర్ యుగల్‌కుమార్

బాడంగి: మండలంలోని కోడూరుమాత(మరియమాత) పుణ్యక్షేత్రంలో నవశనివారాంజలి ప్రార్థనలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రార్థనలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై, మరియమాతను ఆరాధించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఫాదర్ యుగల్‌కుమార్ బైబిల్ వాక్యాలు పఠించి, ఏసుక్రీస్తు సందేశం వినిపించారు. లోక రక్షకుడు ఏసు అని, ఆయన విశ్వాసం పొందిన వారికి స్వర్గప్రాప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బాడంగి ఫాదర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



బోర్లు బాగుచేయిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, ఆడవరం, అక్కన్నఅగ్రహారం తదితర గ్రామాల్లోని పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన శనివారం చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



విద్యుత్ లైన్‌లు సరిచేస్తున్న సిబ్బంది

సంతకవిటి: నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సయ్యద్ తెలిపారు. మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతులు శనివారం చేపట్టారు. వైర్లకు తాకుతున్న చెట్లకొమ్మలు తొలగించడంతో పాటు కొన్నిచోట్ల సరిగా లేని వైర్లను కూడా సరిచేస్తున్నామన్నారు.

భారీ వర్షం



రేగిడి మండల కేంద్రంలో కుండపోతగా కురుస్తున్న వర్షం

రేగిడి: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ సాగులో భాగంగా వరి విత్తనాలు జల్లి, వర్షం తడి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ప్రస్తుతం కురిసిన వర్షం కాస్త ఊరటనిచ్చింది. ఈ వర్షం వరినారు మడికి ఎంతో అనుకూలమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్ కిట్ అందజేత



క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న సంఘ సభ్యులు

రేగిడి: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వాలీబాల్ క్రీడా సంఘానికి ప్రభుత్వం వాలీబాల్ కిట్ మంజూరు చేసింది. ఈ కిట్‌ను మండలంలోని ఏవీపురంలో ఆ సంఘ వైస్ ప్రెసిడెంట్ గట్టి పాపారావు, జిల్లా కార్యదర్శి గట్టి రామచంద్రి నాయుడులు చేతులమీదుగా క్రీడాకారులకు శనివారం అందజేశారు. ఉత్తమ క్రీడాకారులను తయారుచేయడమే లక్ష్యంగా పంపిణీ చేసిన ఈ క్రీడాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వెంకటనాయుడు, రవి, తవిటినాయుడు, హరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తతతోనే ఆరోగ్యం భద్రం

- వాతావరణంలో మార్పులతో విషజ్వరాల వ్యాప్తికి ఆస్కారం
- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యుల సూచన
- వ్యాధుల నియంత్రణకు అధికార యంత్రాంగం చర్యలు



విషజ్వరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామభద్రపురం వైద్యాధికారి శిరీష

రామభద్రపురం: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మురుగు కాలువల్లోని నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాప్తి పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుతం జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వ్యాధుల నివారణకు అధికార యంత్రాంగం తమవంతు ప్రయత్నం చేస్తోంది. వైద్యారోగ్య సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆరోగ్యంపై ప్రజలను చైతన్యపరుస్తున్నారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు. కాస్త అప్రమత్తంగా వ్యవహరించి, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చని చెబుతున్నారు.

నివారణ చర్యలు ఇలా..

విషజ్వరాల కట్టడికి పంచాయతీ అధికారులు, శానిటరీ సిబ్బంది, వైద్య సిబ్బంది విశేషంగా కృషి చేయాల్సి ఉంది. వారానికి ఒక్కరోజు డ్రైడే పాటించేలా అవగాహన కార్యక్రమాలు రూపొందించి, అమలుచేయాలి. అలాగే అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాలను వివరించాలి. పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. జ్వరపీడితులతో పాటు జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి రక్తనమూనాలను కూడా సేకరించి, ఆస్పత్రులకు తరలించాలి. అవసరమైన మేరకు ఉచిత మందులు పంపిణీ చేయాలి. కాలువల్లోని మురుగు కారణంగా వృద్ధి చెందే దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టగా, మరికొన్ని పంచాయతీల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది.

పలు గ్రామాల్లో అవగాహన..

మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఏఎల్‌జీ శిరీష, దిలీప్‌కుమార్‌లు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం వారు పలు గ్రామాల్లో పర్యటించి, గ్రామస్తులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఖాళీ సీసాలు, డబ్బాలు, కొబ్బరిచిప్పలు, టైర్లు, వాటర్‌బాటిళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. కూలర్లలో నీరు నిల్వ ఉంచరాదు. పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి. చిన్నపిల్లలకు శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేయాలి. దోమతెరలు వాడాలి. కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలురు వసతిగృహాన్ని వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష శనివారం సందర్శించి, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతిరోజూ రెండుపూటలా స్నానం చేయాలని, అన్నం తినడానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, మల,మూత్ర విసర్జన తర్వాత సబ్బుతో చేతులను కడ్డుకోవాలని, కాచిచల్లార్చిన నీటినే తాగాలన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండురోజుల తర్వాత జ్వరం తగ్గకపోతే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించాలి. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, యాంటీబయాటిక్స్, సెలైన్ బాటిళ్లు, రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. సాధ్యమైనంత వరకు తాగునీటిని కాచిచల్లార్చి తాగాలి. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి.

–దిలీప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రామభద్రపురం

మున్సిపల్ కమిషనర్ పర్యటన



గాయత్రి కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: పట్టణంలోని గాయత్రి కాలనీలో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు ఏర్పాటు చేయండి

బొబ్బిలి: పట్టణంలో రైతుబజారు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు ఓ ప్రకటనలో శనివారం డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రైతుబజార్లు ఉన్నాయని, ఒక్క బొబ్బిలి పట్టణంలో రైతుబజారు లేకపోవడం చాలా దారుణమన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరల దృష్ట్యా వినియోగదారులకు భారం కాకుండా కూరగాయల ధరలు తక్కువ ధరకు లభించేలా రైతుబజారు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

లైసెన్స్ లేకుంటే చర్యలు



వాహనదారుడి లైసెన్స్ పరిశీలిస్తున్న ఎస్‌ఐ జ్ఞానప్రసాద్

రామభద్రపురం: లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలో సిబ్బందితో కలిసి ప్రధాన రోడ్లలో శనివారం వాహన తనిఖీలు చేసిన ఆయన.. వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలన్నీ తప్పనిసరిగా ఉండాలన్నారు. నంబర్‌ప్లేట్లు లేకపోయినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఒక్కోసారి జైలుశిక్ష కూడా విధించే అవకాశం ఉంటుందన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు ధనుంజయనాయుడు శనివారం తెలిపారు. స్థానిక ఎలీమ్ ప్రార్థనా మందిరంలో పి.కామేశ్వరరావు, పి.మోజేష్‌ల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎన్నిక ఏకగ్రీవం కాగా, సంఘ కార్యదర్శిగా పెంకి మోషే, ఉపాధ్యక్షులుగా ఆర్.నతానుయేల్, ఉపకార్యదర్శిగా బి.జాషువా, కోశాధికారిగా పి.తవిటినాయుడు ఎంపికయ్యారన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా సీతారామస్వామి(తిమోతి), సలహాదారులుగా కె.కామేశ్వరరావు, పి.సురేన్‌బాబు, శాంసన్, ఆనంద్, మోషేరాజులు వ్యవహరించనున్నారన్నారు. 2024–27 వరకు ఈ కార్యవర్గం తమ కార్యకలాపాలు కొనసాగిస్తుందన్నారు.

సమాచార హక్కు చట్టం రాజాం ఇన్‌చార్జిగా అన్నారావు

రాజాం: పట్టణానికి చెందిన కె.అన్నారావు సమాచార హక్కు చట్టం రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపికయ్యారు. ఈ మేరకు తనకు శనివారం ఉత్తర్వులు అందాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఎటువంటి సమస్యలున్నా సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తానన్నారు. ఆయన ఎంపిక పట్ల పట్టణవాసులు అభినందనలు తెలిపారు.

వ్యాధుల నివారణకు టీకాలు దోహదం



తెర్లాంలో చిన్నారికి వ్యాధి నిరోధక టీకా వేస్తున్న ఏఎన్ఎం ప్రశాంతి

తెర్లాం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు వ్యాధి నిరోధక టీకాలు దోహదపడతాయని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు, పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల పరిధిలో వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు టీకాలను ఏఎన్ఎంలు వేశారు. ఈ కార్యక్రమాన్ని వైద్యులు పరిశీలించి, గర్భిణులు, చిన్నారులు క్రమం తప్పకుండా ఈ వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని, వీటిని వేసుకోవడం ద్వారా వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



రేగిడి: సంకిలిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ పట్టాభి



తెర్లాం: అప్పలంపేటలో కాలువలోని పూడికలు తీస్తున్న వేతనదారులు



తెర్లాం: జగన్నాధవలసలో దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న గ్రీన్‌అంబాసిడర్

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం మండలంలోని సంకిలి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్యామలా కుమారి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. వీధులు, రోడ్లు, కాలువల్లోని చెత్తాచెదారం ఏరివేసి, ట్రాక్టర్లలో డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నామన్నారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

తెర్లాం: మండలంలోని విజయరాంపురం, గోపాలవలస, అప్పలంపేట, ఉద్దవోలు తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు శనివారం చేట్టారు. వీధి కాలువల్లోని పూడికలు తీసి, బ్లీచింగ్, సున్నం కలిపిన పౌడర్‌ను చల్లారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



తెర్లాం: చీకటిపేటలో వైద్య శిబిరంలో రోగులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యులు

రాజాం సిటీ: స్థానిక సంతమార్కెట్‌లోని కల్యాణగౌరి మల్లిఖార్జునస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించగా విజయవాడ జీబీఆర్ ఫౌండేషన్‌కు చెందిన వైద్యులు గోపాలం శివనారాయణ అక్కడికి వచ్చిన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు సురేష్, శేఖర్, జయరాం, జె.కామేశ్వరరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని చీకటిపేటలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. చీకటిపేట సహా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి శిబిరానికి హాజరైన రోగులకు కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు శ్రీదేవి, సుజనాలు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మూడడ్ల పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వెంకటాపురంలో వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆసిరినాయుడు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు కె.రేణుక, ప్రసన్న, ఏఎన్ఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడుదాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

బొబ్బిలి: రాష్ట్రంలో టీడీపీ, దేశంలో బీజేపీ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని గంటి ప్రసాద్ స్మారక భవనంలో ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏయే అంశాలపై పోరాటం సాగించాలన్న అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని, ధరల పెరుగుదల వంటి అంశాల్లో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తామని, ఆ దిశగా పార్టీ నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆనందరావు, ఏరియా కార్యదర్శి కండాపు ప్రసాదరావు, కోట అప్పన్న, శ్రీనివాస్, ఎం దుదొర, ముల్లు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకే దేవదాయ భూములు ఇవ్వాలి

- జిల్లా కౌలురైతు సంఘం నాయకుల డిమాండ్



దేవదాయ ధర్మాదాయ శాఖ భూములను పరిశీలిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

బొబ్బిలి: దేవదాయ ధర్మాదాయ శాఖ భూములను సాగు చేసుకుంటున్న వారికే ఇవ్వాలని జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, ఆర్.రాములు డిమాండ్ చేశారు. స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లి, పాతబొబ్బిలి గ్రామాల పరిధిలో రైతులు సాగు చేస్తున్న దేవదాయ ధర్మాదాయ శాఖ భూములను వారు శనివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం ఆ భూములను కౌలుకు 13 శాతం పెంచి, అదే రైతులకు భూములు ఇవ్వాలి తప్ప, కొత్తగా వేలంపాట నిర్వహించి అధిక సొమ్మును రాబట్టుకోవాలన్న ఆలోచనను మానుకోవాలన్నారు. చిన్న, సన్నకారు రైతులెవరూ వేలంపాటలో పాల్గొనలేరని, ధనికులే అధిక ధరకు వేలం పాట పాడి, ఆ భూములు దక్కించుకుంటారన్నారు. ప్రస్తుతం ఆ భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్న రైతులకే మళ్లీ ఆ భూములను సాగుచేసుకునే అవకాశం కల్పించి, ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ రాయితీలన్నీ కౌలురైతులకు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్ విడుదలపై ఉద్యోగ సంఘాల మండిపాటు



ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, సంఘ సభ్యులు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ అమలు గెజిట్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి అన్నారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రతులను శనివారం దహనం చేసి, ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పాతపెన్షన్ విధానం అమలు చేయకపోగా కొత్తగా జీపీఎస్ అమలుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత ప్రభుత్వం చేసిన జీపీఎస్ అమలు చేయకుండా పోరాటాలు చేశామని ఇప్పుడు మళ్లీ అదే జీపీఎస్‌ను అమలుచేస్తామని ప్రస్తుత ప్రభుత్వం చెబుతుండడం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను మోసం చేయడమేనన్నారు. తక్షణమే ఈజీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్న మాట్లాడుతూ 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన అందరికీ పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేశవరావు, బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం సంఘాల నాయకులు సుధాకర్, మహేష్, వరప్రసాద్, స్వామినాయుడు, కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కల పెంపకం చేపట్టాలి



మొక్కలు నాటుతున్న డీఎస్పీ చక్రవర్తి తదితరులు

రాజాం సిటీ: ఉద్యమంలా మొక్కల పెంపకం చేపట్టాలని చీపురుపల్లి డీఎస్పీ ఎ.శ్రీనివాసచక్రవర్తి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా మొక్కల పెంపకం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమ పుట్టినరోజు, పెళ్లి రోజులకు గుర్తుగా మొక్కలు నాటాలన్నారు. తల్లి పేరిట మొక్కలు నాటాలని కేంద్రం ఇచ్చిన పిలుపు మేరకు ప్రతిఒక్కరూ ఒక మొక్క చొప్పున నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు, వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీపీ రమణమూర్తి, విశ్రాంత ఎంపీడీవో డి.త్రినాధులు, మహంతి సత్యనారాయణ, టంకాల మురళీకృష్ణ, నీకలంతం తదితరులు పాల్గొన్నారు.